నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 22 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

## ధాన్యం కొనుగోళ్లకు చర్యలు



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 21 : వానకాలం ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కొనుగోళ్ల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ నుంచే ధాన్యంపై రూ.500 బోనస్‌ను వర్తింపజేయాలని అన్నారు. కొనుగోళ్లపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడే తూకం, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ మేనేజర్ నరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజీప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాం గోపాల్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..



యాదగిరి శేఖర్‌రావును సన్మానిస్తున్న సంఘం సభ్యులు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 21 : ప్రైవేట్ విద్యారంగ సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తామని పట్టభద్రుల ఎమెల్సీ అభ్యర్థి, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. శనివారం నిర్మల్ పట్టణంలోని వశిష్ట ఇంపర్స్ ఈ-టెక్నో స్కూల్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రస్మా నాయకులు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తనకు మద్దతు తెలిపితే ప్రైవేటు రంగాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ముక్తార్ పాల్గొన్నారు.



వికలాంగులకు బ్యాటరీ సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

## కత్తితో విధ్వంసం.. పెన్నుతో భవిష్యత్ మార్పు..

● ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

● పలు చోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

ఉట్నూర్, సెప్టెంబర్ 21 : కత్తులు పడితే విధ్వంసాలు జరుగుతాయని, అదే పెన్ను చేత బడితే భవిష్యత్‌లు మారుతాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదట బీఈడీ విద్యార్థుల కోసం రూ.60 లక్షలతో నిర్మించిన హాస్టల్‌ను ప్రారంభించారు. బీఈడీ విద్యార్థులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం వచ్చాక డీఎస్సీ వేశామన్నారు. గిరిజనులకు హక్కులు కల్పించేందుకే అంబేద్కర్ రిజర్వేషన్ తీసుకొచ్చారన్నారు. అనంతరం ప్రత్యేక అవసరాల పిల్లల కోసం అదనపు గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రి సీతక్కను ఘనంగా ఆహ్వానించారు. అనంతరం గిరిజన మహిళ సంఘాలకు కోళ్ల పెంపకం యూనిట్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి వికలాంగులకు ట్రై సైకిల్ పంపిణీ, మారుమూల గిరిజన గ్రామాలకు వైద్యసేవలు అందించేందుకు టూ వీల్లర్ మొబైల్ అంబులెన్స్‌లను ప్రారంభించారు. అక్కడి నుంచి మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించి వారి వంటకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా నాయకురాలు సుగుణ, ఏపీవో వసంత్‌రావు, ఏజెన్సీ వైద్యాధికారి మనోహర్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ పాల్గొన్నారు.

# విజయ రైతుల అరిగోస

**పాడి బకాయిలు రూ.3.50 కోట్లు ● రెండున్నర నెలలుగా నిలిచిన బిల్లులు**

● పాలు పోయడం మానేసిన రైతులు ● మూతపడిన ఉట్నూర్ కేంద్రం ● నేడో, రేపో ఇచ్చోడ, బేల కేంద్రాల మూసివేత





ఆదిలాబాద్ విజయ డెయిరీ పాలకేంద్రం



ఉట్నూర్‌లో మూతపడిన పాలకేంద్రం

ఆదిలాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ పాలనలో దేదీప్యమానంగా వెలిగిన విజయ డెయిరీ.. ప్రస్తుతం గాలిలో దీపంలా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం పాడి రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నెలల తరబడి బిల్లులు రావడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు వేల మంది రైతులు ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీకి పాలు పోస్తున్నారు. రోజు ఆరు వేల లీటర్ల పాలసేకరణ జరుగుతున్నది. ప్రతి పక్షం రోజులకు ఒకసారి ప్రభుత్వం పాడి రైతుల డబ్బులను చెల్లించాలి. పక్షం రోజులకు బిల్లు రూ.70 లక్షలు అవుతుండగా.. రెండున్నర నెలలుగా రైతులకు పాల పైసలు రావడం లేదు. దీంతో రైతులు విజయ డెయిరీలో పాలు పోయడం మానేశారు. ఆదిలాబాద్ జిల్లాలో విజయ డెయిరీకి సంబంధించిన నాలుగు పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. ఆదిలాబాద్‌తోపాటు ఇచ్చోడ, బేల, ఉట్నూర్‌లో పాల సేకరణ కేంద్రాలు ఉండగా.. ఇప్పటికే ఉట్నూర్ కేంద్రం మూతపడింది. ఉట్నూర్, బేల, ఆదిలాబాద్ పాల సేకరణ కేంద్రాల పరిస్థితి అధ్వానంగా తయారైంది. విజయ డెయిరీకి విక్రయించిన పాల పైసలు రాకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 600 మంది రైతులు పాలు పోయడం మానేశారు. గతంలో వేల లీటర్లలో వచ్చే పాలు ఇప్పుడు వందల లీటర్లలో కూడా రావడం లేదు. పాలసేకరణ తగ్గడంతో ప్రస్తుతం నడుస్తున్న మూడు కేంద్రాల పరిస్థితి మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి.

### రైతుల ఇబ్బందులు

వ్యవసాయం చేసే రైతులు బర్రెలు, ఆవులు పెంచుకుంటూ పాలను విక్రయిస్తుంటారు. విజయ డెయిరీ ఆధ్వర్యంలో అధికారులు రైతుల వద్ద నుంచి రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో పాలను సేకరిస్తారు. పాలలో వెన్న శాతం ఆధారంగా రైతులకు డబ్బులు చెల్లిస్తారు. డెయిరీ నుంచి పాల సేకరణ బాగా జరుగుతుండటంతో రైతులు బ్యాంకుల్లో, ఇతర సంస్థల్లో రుణాలు తీసుకుని బర్రెలు, ఆవులు కొనుగోలు చేసి డెయిరీలు ఏర్పాటు చేసుకుని పాల వ్యాపారం చేస్తున్నారు. ఈ ఏడాది జూలై 15 వరకు రైతులకు పాల డబ్బులు వచ్చాయి. రెండున్నర నెలలుగా డబ్బులు రావడం లేదు. తమకు రావాల్సిన పైసల కోసం పాడి రైతులు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండడం లేదు. దీంతో బర్రెలు, ఆవులు పెంపకం కోసం రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలు చెల్లించలేకపోతున్నారు. నెలల తరబడి లోన్ కట్టకపోవడంతో వడ్డీ తడిసిమోపడవుతున్నది. ప్రతి 15 రోజులకు ఒకసారి వచ్చే డబ్బులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్ డెయిరీ కార్యాలయం నుంచి డబ్బులు మీ బ్యాంకు ఖాతాల్లో పడుతాయని, తాము ఏమీ చేయలేమని విజయ డెయిరీ అధికారులు సమాధానం ఇస్తున్నారని రైతులు అంటున్నారు.

### జోరుగా ప్రైవేట్ డెయిరీల విక్రయాలు

ఆదిలాబాద్ జిల్లాలో పలు ప్రైవేట్ డెయిరీలకు చెందిన పాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ప్రాంతాల్లోని ప్రైవేటు డెయిరీల పాల ప్యాకెట్లను ఆదిలాబాద్ జిల్లాలో విక్రయిస్తున్నారు. రోజు దాదాపుగా 60 వేల లీటర్ల పాలు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నాయి. విజయ డెయిరీకి పాల సేకరణ లేకపోవడంతో వారు సరిగా విక్రయాలు జరపడం లేదు. పాల పదార్థాలు తయారు చేయడానికి సరిపడా పాలు లేకపోవడంతో డెయిరీ సిబ్బంది ఏమి చేయలేని పరిస్థితి నెలకున్నది.

### రెండు నెలల నుంచి డబ్బులు రాలేదు..



*నేను బేలలో విజయ డెయిరీ పాల కేంద్రానికి రోజు పాలు పోస్తా. రోజు ఏడు లీటర్ల పాలను విక్రయిస్తుండగా లీటర్‌కు రూ.50 చొప్పున చెల్లిస్తారు. రోజు రూ.350 నాకు పాలను విక్రయించిన పైసలు రావాలి. రెండు నెలలగా డబ్బులు రావడం లేదు. దాదాపు రూ. 21 వేలు విజయడెయిరీ నుంచి రావాల్సి ఉండగా అధికారులను అడిగితే ప్రధాన కార్యాలయం నుంచి డబ్బులు మీ అకౌంట్‌లో పడుతాయని అంటున్నారు. గతంలో 15 రోజులకు ఒకసారి పాల పైసలు మా బ్యాంక్ ఖాతాల్లో పడేవి ఇప్పుడు పాడి రైతులు పరిస్థితి అధ్వానంగా తయారైంది.*

**- గజానన్, పాడి రైతు, చాప్రాల, బేల మండలం ( 2 ఏడీబీ 21 సీ)**



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

## భూములివ్వం..

● ఎకరానికి రూ.40 లక్షలు.. ఇంటికో ఉద్యోగం ఇవ్వాల్సిందే..

● కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన రైతులు

ఎదులాపురం, సెప్టెంబర్ 21 : రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి తమ భూములను ప్రభుత్వం నిర్ణయించిన రూ.8.50 లక్షలకు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమని యాపల్‌గూడ రైతు రమేశ్ స్పష్టం చేశారు. శనివారం రైతులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు రూ.8.50 లక్షలకే భూములు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ ధరకు అనుగుణంగా ఎకరానికి రూ.40 లక్షలతోపాటు ఇంటికో ఉద్యోగం, ఇంటి నిర్మాణం చేసి ఇస్తేనే స్వచ్ఛందంగా భూములు ఇస్తామన్నారు. లేనిపక్షంలో ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. అధికారులు అనవసరంగా తమపై ఒత్తిడి పెంచడంతోపాటు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు.



నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పార్డి(కే) తండాలో బోరు బావి నుంచి నీటిని తోడుకుంటున్న గిరిజనులు

## గిరిజనులకు నీటి కష్టం



కర్రకు స్టీల్ క్యాన్ కట్టి బారుబావిలో నుంచి నీటిని తోడుతున్న గ్రామస్తులు

*పార్డి(కే) జీపీ అనుబంధ గ్రామమైన పార్డి(కే) తండాలో 20 రోజులుగా నీటి ఎద్దడితో గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 20 కుటుంబాలకు ఒకే బోరుబావి ఉంది. మిషన్ భగీరథ పైపులైన్‌కు జాంగాం-పార్డి(కే) మధ్య పార్డి(కే)లోని పోచమ్మ మందిరం వద్ద నెలక్రితం మురుగుకాలువ పూడిక తొలగిస్తుండగా పైపులైన్ పగిలింది. దీంతో గిరిజనులకు తాగునీరు లేకుండా పోయింది. బోరు రంధ్రంలోని మోటారు తొలగించి అందులో నుంచి స్టీల్ క్యాన్ తాడుతో కట్టి నీటిని తోడుకుని బిందెలలో నింపి తాగుతున్నామని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమకు కష్టం కలుగలేదని తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ విషయమై ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. ఈ రోజు సాయంత్రం వరకు మోటారు రిపేరు చేయించి తాగు నీరందించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ పైపులైన్‌కు జాయింట్ చేయించి ఆ నీరు తండాకు సరఫరా చేయిస్తామని అన్నారు.*

**- కుభీర్, సెప్టెంబర్ 21**

## చోరీకి యత్నించిన ఇద్దరి రిమాండ్

ముథోల్, సెప్టెంబర్ 21 : ముథోల్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో గల ఎస్‌బీఐ బ్యాంకులో చోరీకి యత్నించిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. ఈ కేసు వివరాలను ముథోల్ ఠాణాలో వెల్లడించారు. ఈ నెల 13వ తేదీన బ్యాంకు వెనుక భాగంలో గల వెంటిలెటర్‌కు ఉన్న ఇనుప చువ్వలను తొలిగించి చొరబడ్డట్లు తెలిపారు. బ్యాంకులో ఉన్న సీసీ కెమెరాలు, అలారం వైర్లను కత్తిరించి చోరీకి యత్నం చేశారు. వీలుకాకపోవడంతో పరారైనట్లు ఆయన వివరించారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్సై సాయికిరణ్ తన సిబ్బందితో ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి విచారణ ముమ్మరం చేశారు. దీంతో ఇద్దరు సీసీ కెమెరాలో కనబడడంతో విచారణ జరిపి ముథోల్‌కు చెందిన షేక్ మోతిన్ అహ్మద్, మహ్మద్ ఇర్ఫానుద్దీన్‌లను చోరీకి యత్నించినట్లు గుర్తించారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ



దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న బాధిత బంధువులు

## బాలింత మృతి

● న్యాయం చేయాలని దవాఖాన ఎదుట బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన

● వైద్యురాలిపై కేసు నమోదు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 21 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని డాక్టర్స్ లేన్‌లోని ఓ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిందని కుటుంబ సభ్యులు శనివారం ఆసుపత్రి ఎదుట నిరసన చేపట్టారు. నిర్మల్ పట్టణంలోని షేక్‌షాహెబ్ పేట్ కాలనీకి చెందిన గర్భిణీ ఫర్హాన(35) డెలివరి కోసం శుక్రవారం మధ్యాహ్నం ఆసుపత్రిలో చేరింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. డెలివరి అయిన కొన్ని గంటల తర్వాత తీవ్ర రక్తస్రావం కావడంతో నిర్మల్‌లోని మరో ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పేషెంట్ కండిషన్ చూసి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి పంపించారు. యశోద ఆసుపత్రి వైద్యులు పరీక్షించి ఆమె ఐదు గంటల క్రితమే మృతి చెందిందని నిర్ధారించారని బంధువులు తెలిపారు. వైద్యులు నిర్లక్ష్యంతోనే చనిపోయిందని తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన, రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, భైంసా ఏఎస్పీ అవినాశ్ ఆందోళనను సద్దుమణిగించారు. భర్త అఫ్రోజ్ అహ్మద్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైద్యురాలు సుమలతపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## తెలంగాణ ఉద్యమంలో బాపూజీది కీలక పాత్ర

**బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్**



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, సెప్టెంబర్ 21 : తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలకపాత్ర పోషించారని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కొనియాడారు. శనివారం మండల కేంద్రంలో బాపూజీ 12వ వర్ధంతిని నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలు, తెలంగాణ సాధన కోసం తన జీవితాంతం పోరాడిన వ్యక్తి అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంతోపాటు మరెన్నో ఉద్యమాలకు ఊపిరిలూది భావి నాయకులను తయారు చేసిన మహనీయుడని కొనియాడారు. మంత్రి పదవిని తృణప్రాయంగా త్యాగం చేసి ఉద్యమంలో యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు కేదార్‌రెడ్డి, అభిరాంరెడ్డి, లింగన్న, ప్రతాప్‌సింగ్, కైలాస్ పాల్గొన్నారు.

## ఇథనాల్ పరిశ్రమతో ఇబ్బందులు రాకుండా అధ్యయనం చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 21 : ఇథనాల్ పరిశ్రమ వల్ల రైతులకు ఇబ్బందులు కలుగకుండా శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో శనివారం ఇథనాల్ పరిశ్రమపై అధికారులతో పరిశ్రమ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాలుష్య నియంత్రణ మండలిసహా సంబంధిత శాఖల నిబంధనలను పరిశ్రమ యాజమాన్యం కచ్చితంగా పాటించాలన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశ్రమ నిర్వహణను వివరించారు. త్వరలోనే గ్రామస్తులు, రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అంజీప్రసాద్, భూగర్భ జలశాఖ అధికారి శ్రీనివాస్‌బాబు, డీఎంహెచ్‌వో రాజేందర్, అర్అండ్‌బీ ఈఈ అశోక్, పరిశ్రమల శాఖ మేనేజర్ నరసింహారెడ్డి, తహసీల్దార్ స్వాతి, ఎంపీడీవో అరుణారాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్



బోథ్‌లో పిడుగుపాటుతో దెబ్బతిన్న డిష్, గోడ



బేల మండలంలోని సిర్సన్నలో పిడుగు పడి మృతి చెందిన అవినాష్ (ఫైల్)

## జోరువాన

● ఆదిలాబాద్ జిల్లాలో వర్షం

● పిడుగు పడి రైతు మృతి

● పంటలకు మేలంటున్న రైతులు

బోథ్/బేల/ఇంద్రవెల్లి/తలమడుగు, సెప్టెంబర్ 21 : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా శనివారం జోరువాన కురిసింది. బేల మండలంలోని సిర్సన్న గ్రామంలో శనివారం పిడుగు పడి రాథోడ్ అవినాశ్(21) మృతి చెందాడు. సిర్సన్న గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాథోడ్ అవినాశ్ వ్యవసాయం పనుల కోసం కూలి పనికి వెళ్లి పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి బాబాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం జిల్లా రిమ్స్‌కు తరలించడం జరిగిందని ఎస్సై తెలిపారు. పంటలకు కావలసిన సమయంలో వర్షం కురవడంతో మండల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా. బోథ్‌లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం పడడంతో గాంధీచౌక్(9వ బ్లాక్)లోని మేర రాజన్న ఇంటిపై ఉన్న డీటీహెచ్ డిష్‌పై పిడుగు పడడంతో పిల్లర్ గోడ ధ్వంసమైంది.

## పోలీసులపై దాడి చేసిన ఐదుగురి అరెస్టు

సోన్, సెప్టెంబర్ 21: గణేశ్ నిమజ్జనం సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడి చేసిన ఐదుగురిని శనివారం అరెస్టు చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. నిర్మల్ పట్టణం మంజులాపూర్‌లో గణేశ్ నిమజ్జనంలో బందోబస్తు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సాయిశ్రవంత్‌ను గ్రామానికి చెందిన దశరథ ముత్యం, దశరథ ప్రవీణ్, శ్రీదేవ వినయ్, ఎం సంతోష్‌కుమార్, ఉల్లెంగ భోజన్న తోసివేశారు. రోడ్డుపై ట్రాఫిక్ జాం కావడంతో కానిస్టేబుల్ మండపాల నిర్వాహకులను ట్రాఫిక్‌కు సహకరించాలని కోరగా వారు నిరాకరిస్తూ దాడి చేశారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ సాయికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తూ ఐదుగురిని అరెస్టు చేశామని తెలిపారు. వారిని నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి అరెస్టు చేసి కోర్టులో రిమాండ్‌కు తరలించడం జరిగిందని పేర్కొన్నారు.